
www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 5 ఫిబ్రవరి 2025
5
తిరుపతి



డీజీపీని కలిసిన టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఏపీ డీజీపీ గా భాధ్యతలు చేపట్టిన హరీష్ కుమార్ గుప్తని తిరుపతి ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్‌ఫోర్స్ (ఆర్ఎస్ఏఎస్టీ ఎఫ్) ఎస్పీ పీ శ్రీనివాస్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీజీపీ టాస్క్ ఫోర్స్ పని తీరును ఎస్పీని అడిగి తెలుసు కున్నారు. ఆపరేషన్స్, కూంబింగ్, అక్రమ రవాణాను అడ్డుకోవడానికి సాంకేతికంగా తీసుకుంటున్న చర్యలను ఎస్పీ శ్రీనివాస్ డీజీపీకి వివరించారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడానికి మరింతగా కృషి చేయాలని డీజీపీ సూచించారని ఎస్పీ తెలిపారు.


డీజీపీని కలిసిన టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్

టిడిపి అభ్యర్థిదే గెలుపు

- డిప్యూటీ మేయర్‌గా ఆర్‌సి మునికృష్ణ
- గెలుపులో వైసిపి కార్పొరేటర్ కీలకం
- ఇది ప్రజాస్వామ్య గెలుపు..
- కిడ్నాప్ , రౌడీయిజంతో గెలుపు
- టిడిపికి 26, వైసిపీకి 21 మంది ఓట్లు
- ఓటు వేయని వైసిపి కార్పొరేటర్ అమరనాథ్ రెడ్డి
- ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు కితాబు
- ఎంపీ డాక్టర్ గురుమూర్తి విమర్శ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ఎస్‌వి సెనేట్ హాలులో సోమవారం జరగాల్సిన తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నిక కోరం లేక వాయిదా పడింది. ప్రశాంతంగా నిర్వహించాలన్న హైకోర్టు ఆదేశంతో పోలీసు బందోబస్తు మధ్య మంగళవారం నిర్వహించారు. ఎన్నో కీలక మలుపుల అనంతరం ఈ ఎన్నికలో తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్‌గా 26 మంది మద్దతుతో టిడిపి అభ్యర్థి ఆర్‌సి మునికృష్ణ గెలుపు సాధించారు. ఈ మేరకు ఎన్నికల అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ టిడిపి అభ్యర్థి గెలుపును నిర్ధారించి ధ్రువీకరణ పత్రాన్ని అందించారు.

ఎన్నో మలుపుల మధ్య టిడిపి అభ్యర్థి గెలుపు

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నిక ఎన్నో మలుపులు తిరిగి టిడిపి ఏకైక కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ డిప్యూటీ మేయర్‌గా గెలుపొందినట్లు ఎన్నికల అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ 12 గంటలకు ప్రకటించారు. వైసిపి కార్పొరేటర్లు ఒక్కొక్కరు చేజారిపోవడంతో టిడిపి డిప్యూటీ మేయర్ అభ్యర్థి ఆర్‌సి మునికృష్ణను వైసిపి కార్పొరేటర్లు గెలిపించారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్య ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి ప్రకటించడంతో పదిన్నర గంటలకు వైసిపీ కార్పొరేటర్లు ఎంపీ డాక్టర్ గురుమూర్తితో సహా 21 మంది కార్పొరేటర్లు ప్రత్యేక బందోబస్తు మధ్య బస్సుల్లో ఎస్‌వి సెనేట్ హాలుకు చేరుకున్నారు. ఇటు టిడిపి, జనసేనకు చెందిన కార్పొరేటర్లు ప్రత్యేక బస్సులో ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులుతో సహా 11 గంటల 20 నిమిషాలకు ఎస్‌వి సెనేట్ హాలుకు చేరుకున్నారు. 11.30 గంటలకు ఎన్నికల అధికారి శుభం బన్సల్ ఎన్నిక ఉంటుందని టిడిపి, వైసిపి, జనసేన కార్పొరేటర్లకు వివరించారు. కార్పొరేటర్లతో సహా వైసిపి టిడిపి జనసేన తిరుపతి ఎమ్మెల్యే, ఎంపీతో కలిపి 48 మంది ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎన్నికల అధికారి పేర్కొన్నారు. 11.45 గంటలకు ఎన్నిక నిర్వహించారు. ముందు వైసిపి కార్పొరేటర్ డిప్యూటీ మేయర్ అభ్యర్థి లడ్డు భాస్కర్ రెడ్డి అభ్యర్థిని ప్రతిపాదిస్తున్నట్టు 27వ డివిజన్ కార్పొరేటర్ మేయర్ డాక్టర్ శిరీష ప్రతిపాదించారు. రెండో ప్రతిపాదన వైసిపి కార్పొరేటర్ ఒకటో డివిజన్ రాధారెడ్డి ప్రతిపాదించారు. ఇటు టిడిపి డిప్యూటీ మేయర్ అభ్యర్థి, కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ పేరును తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు ప్రతిపాదించారు. రెండో ప్రతిపాదన 48వ డివిజన్ కార్పొరేటర్ అన్న అనిత యాదవ్ ప్రతిపాదన చేశారు. వైసిపి డిప్యూటీ మేయర్ అభ్యర్థి లడ్డు భాస్కర్ ఎంత మంది ఓటు వేస్తున్నారు చేయెత్తి చూపాలని ఎన్నికల అధికారి, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ అడిగారు. లడ్డు భాస్కర్ కు తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి తో సహా 21 మంది చేతులెత్తి ఓటు వేశారు. టిడిపి డిప్యూటీ మేయర్ అభ్యర్థి ఆర్‌సి మునికృష్ణకు ఎమ్మెల్యే సహా 26 మంది ఓటు వేశారు. వైసిపీ కార్పొరేటర్ అమరనాథ రెడ్డి మాత్రం ఎటువైపు ఓటు వేయలేదు. దీంతో తిరుపతి డిప్యూటీ మేయర్‌గా ఆర్‌సి మునికృష్ణ గెలిచినట్టు ప్రకటించారు. అంతకు ముందు తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి 20 మంది కార్పొరేటర్లతో ఉదయం 10.20 గంటలకు సెనేట్ హాలుకు చేరుకున్నారు. తమ విప్ జారీ చేయాలని ఎన్నికల అధికారికి తెలపడంతో విప్ సమయం ఉదయం 10 గంటలకు అమలు చేయాలని టైం దాటిపోయిందని ఎన్నికల అధికారి అందుకు నిరాకరించారు. ఎస్‌వి సెనేట్ హాలు వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. పోలీసులు ప్రత్యేక బలగాలతో ఎన్నికలు నిర్వహించారు. పోలీసుల బందోబస్తు కారణంగా చంద్రగిరి తిరుపతి మధ్య వచ్చే వాహనచోదకుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి.


ఆర్‌సి మునికృష్ణకు ధృవీకరణ పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

కిడ్నాప్‌కు గురై అటుఇటు..

వైసిపి కార్పొరేటర్ అమరనాథ రెడ్డి, అనిల్ కుమార్, కృష్ణ యాదవ్, అనీష్ రాయల్ ఉదయం ఓటింగ్‌లో పాల్గొనడానికి 11.30 గంటలకు చేరుకున్నారు. అందులో ముగ్గురు మాత్రం టిడిపికి ఓటు వేశారు. ఒకరు మాత్రం ఏ పార్టీ అభ్యర్థికీ ఓటు వేయకుండా మౌనంగా ఉండి పోయారు. ఎన్నికల అయిన తర్వాత ఈ నలుగురు కార్పొరేటర్లు తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి నివాసానికి వెళ్లి బోరున విలపించారు. వారి కాళ్లు పట్టుకొని క్షమాపణ కోరారు. కూటమి పార్టీ నేతలు తమను అనేక ఇబ్బందులకు గురిచేశారని అందువల్లే వారికి ఓటు వేయాల్సిన పరిస్థితి వచ్చిందని వివరించారు. వారిని మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి ఓదార్చారు.

ఓటింగ్‌కు రాని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం

డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో సోమవారం ఓటింగ్‌కు వచ్చిన ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం మంగళవారం ఎన్నికల వాయిదా పడడంతో ఉదయం జరిగిన ఎన్నికల్లో ఓటింగ్‌కు ఆయన రాలేక పోయారు. వైసిపి తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి తమ ఎమ్మెల్సీని కిడ్నాప్ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం తనకు ఆరోగ్యం బాగాలేదని ఆస్పత్రిలో అడ్మిట్ అయి చికిత్స తీసుకుంటున్నానని సోషల్ మీడియాలో ఓ వీడియో రిలీజ్ చేసి మీడియాకు ప్రకటించారు. అయితే ఇది కూటమి నేతలు ఆయన ఆస్పత్రికి ఆరోగ్యశ్రీ నిధులు రాకుండా అడ్డుకుంటామని బెదిరించడం వల్లే భయపడి ఓటింగ్‌కు రాకుండా చేశారని పేర్కొన్నారు.

కిడ్నాప్‌లు, రౌడీయిజంతోనే గెలుపు: ఎంపీ

వైసిపి డిప్యూటీ మేయరు అభ్యర్థిని గెలవనీయకుండా తమ కార్పొరేటర్లను కూటమి ప్రభుత్వం నేతలు కిడ్నాప్ లు, దౌర్జన్యాలు, దాడులు చేసి భయభ్రాంతులకు గురిచేసి ఓటింగ్‌కు రానివ్వకుండా అడ్డుకున్నారని అందుకే టిడిపి అభ్యర్థి గెలుపొందారని ఎంపీ డాక్టర్ గురుమూర్తి విమర్శిం చారు. ఇది ఒక గెలుపు కానే కాదని నిజమైన గెలుపు వైసిపిదేనని ప్రకటిం చారు.


మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి, మేయర్ శిరీష

ప్రజాస్వామ్య పద్ధతిలోనే గెలుపు: ఎమ్మెల్యే

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ప్రజాస్వామ్య పద్ధతితో తమ అభ్యర్థి మునికృష్ణ గెలుపొందారని తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు తెలిపారు. వైసిపి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి కూటమి నేతలపై దాడులు, దౌర్జన్యాలు చేస్తున్నారని ఎన్ని బెదిరింపులకు పాల్పడినా గెలుపు తమదేనని పేర్కొన్నారు. వైసిపికి ప్రజల నుంచి ఆదరణ లేదని టిడిపి గెలుపు చూసి ఓర్వలేకే వైసిపి రాద్ధాంతం చేస్తోందని విమర్శించారు.

త్వరలో మేయర్‌పై అవిశ్వాస తీర్మానం

వైసిపి 27వ డివిజన్ కార్పొరేటర్ మేయర్ డాక్టర్ శిరీషపై టిడిపి, జనసేన కూటమి నేతలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి ఆమెను దించేందుకు ప్రణాళికను రూపొందిస్తున్నారు. తిరుపతి డిప్యూటీ మేయర్‌గా టిడిపి అభ్యర్థి ఆర్‌సి మునికృష్ణ గెలుపొందడంతో మేయర్ డాక్టర్ శిరీషను దింపి 48వ డివిజన్ కార్పొరేటర్ అన్న అనిత యాదవ్‌ను మేయర్ చేయాలనలో ఉన్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో టిడిపి, జనసేన జెండా ఎగరవేసి తమ సత్తాను చాటాలని కూటమి నాయకులు భావిస్తున్నారు.

తిరుమలలో వైభవంగా రథసప్తమి

ప్రజాశక్తి -తిరుమల: సూర్య జయంతిని పురస్కరించుకుని తిరుమలలో రథసప్తమి ఉత్సవాన్ని మంగళవారం టిటిడి వైభవంగా నిర్వహించింది. ఒకే రోజు శ్రీమలయప్ప స్వామి సూర్యప్రభ, చిన్నశేష, గరుడ, హనుమ, కల్పవృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహనాలపై విహరించారు. వాహన సేవలను తిలకించేందుకు ఉదయాత్పూర్వం నుండి ఎంతో ఆసక్తితో నిరీక్షిస్తున్న వేలాది మంది స్వామి వాహనసేవలను తిలకించారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఛైర్మన్ బి ఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అడిషనల్ ఈఓ వెంకయ్య చౌదరి , పాలక మండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ, ఎమ్మెస్ రాజు, పనబాక లక్ష్మి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, ఎస్. సదాశివరావు, సుచిత్ర ఎల్లా, నరేష్ , శాంతా రామ్ , రాజశేఖర్ గౌడ్ , రంగశ్రీ , జానకి దేవి , జెఈఓ వీర బ్రహ్మం , ఎస్పీ హర్షవర్ధన్ రాజు , సివిఎస్ ఓ మణికంఠ పాల్గొన్నారు

రథసప్తమి ఏర్పాట్లపై భక్తులు హర్షం

ప్రజాశక్తి -తిరుమల: టిటిడి అధికారులు, సిబ్బంది, పోలీసులు, జిల్లా యంత్రాంగం సేవలు, శ్రీవారి సేవకుల సేవలను ఛైర్మన్ బీఆర్ నాయుడు అభినందించారు. తిరుమలలో రథసప్తమి సందర్భంగా మంగళవారం సాయంత్రం కల్పవృక్ష వాహనం, అనంతరం మాడ వీధుల్లో టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు, పలువురు పాలకమండలి సభ్యులు, టిటిడి ఈవో జె శ్యామల రావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మంల ముందు భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ నాలుగు మాడ వీధుల్లో భక్తులు సౌకర్యార్థం టిటిడి అధికారులు, సిబ్బంది, పోలీసులు, జిల్లా యంత్రాంగం, శ్రీవారి సేవకులు విశేషంగా సేవలు అందించారని ప్రశంసించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు టిటిడి ఛైర్మన్, టిటిడి ఈవో, అదనపు ఈవో లను వ్యక్తిగతంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పాలకమండలి సభ్యులు పనబాక లక్ష్మి, శాంతా రామ్, సదాశివ రావు, టిటిడి జేఈవో వీరబ్రహ్మం, సివిఎస్వో మణికంఠ చందోలు, పలువురు అధికారులు పాల్గొన్నారు. .


వాహన సేవలో పాల్గొన్న టిటిడి అధికారులు

పశువైద్య విద్యార్థుల నిరవధిక సమ్మె

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం విద్యార్థులు తమ వచ్చే ఉపకార వేతనం పెంచాలని కోరుతూ నిరవధిక సమ్మెను రెండో రోజు మంగళవారం కూడా కొనసాగించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు జానపూడి ఇజ్రా మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని మిగతా వైద్య విద్యార్థులతో సమానంగా తమకు కూడా తగినంత స్టైపెండ్ కల్పించాలని డిమాండ్ చేశారు. పశు వైద్య విద్యార్థుల స్టైఫెండ్ గత 12 ఏళ్లుగా ఏడు వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. మూడు నెలల క్రితం పశు సంవర్ధక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి తమ సమస్యలతో కూడిన ఉపకార వేతనం పెంపుదల వినతి పత్రాన్ని అందించారు. గత ఆరు నెలలుగా మేము స్టైఫండ్ పెరుగుతుందనే ఆశతో వేచి చూశామని అన్నారు. ప్రభుత్వం మా స్టైఫండ్ 7 వేల నుంచి మిగతా వైద్య విద్యార్థులకు ఇస్తున్న విధంగా పెంచేవరకు తమ సమ్మెను విరమించమని అధికారులకు తెలిపారు. తాము ప్రభుత్వానికి, యూనివర్సిటీ అధికారులకు వ్యతిరేకంగా తమ సమ్మెను నిర్వహించటలేదని విద్యార్థులు స్పష్టం చేశారు. పశువైద్య విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి విసి డాక్టర్ జె.వి. రమణ, రిజిస్ట్రర్ డాక్టర్ శ్రీలత, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ శోభామణి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ చంగల్ రాయులు, అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య, ఓ.ఎస్.ఏ డాక్టర్ వేణులు విద్యార్థులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరానికి చేరుకొని విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకొని తాము ప్రభుత్వ అధికారుల దృష్టికి ఈ విషయం తీసుకెళతామని, ఒక నెల సమయం ఇవ్వాలని విద్యార్థులను కోరారు. స్టాఫ్ అండ్ పెంచుతూ జీవో విడుదల చేసేంతవరకు తమ నిరవధిక సమ్మె దీక్ష విరమించే ప్రసక్తే లేదని విద్యార్థులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సంఘం విద్యార్థులు పాల్గొన్నారు.


నిరవధిక సమ్మె చేపట్టిన ఎస్‌వి పశువైద్యకళాశాల విద్యార్థులు

ఐఐటీని సందర్శించిన ఈశాన్య ప్రాంత విద్యార్థులు


ఐఐటీ కళాశాలను సందర్శించిన ఈశాన్య ప్రాంత విద్యార్థులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఏర్పేడులో ఉన్న తిరుపతి ఐఐటీ కళాశాలను ఈశాన్య ప్రాంత రాష్ట్రాలకు చెందిన 25 మంది విద్యార్థుల బృందం మంగళవారం సందర్శించింది. స్టూడెంట్స్ ఎక్స్పీరియన్స్ ఇన్ ఇంటర్–స్టేట్ లివింగ్ ప్రోగ్రాం టూర్‌లో భాగంగా వీరంతా తిరుపతి క్యాంపస్‌కు చేరుకోగా ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణ స్వాగతం పలికారు. డీన్ ఆఫ్ కాంపిటెన్సీ డెవలప్‌మెంట్ అండ్ అవుట్రైచ్ యాక్టివిటీస్ ప్రొఫెసర్ అరుణ్ తంగిరాల కళాశాల గురించి వివరించారు.

పార్కుల్లో నిర్వహణ లోపిస్తే చర్యలు: కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పార్కుల్లో నిర్వహణ లోపం కనిపిస్తే సంబంధిత కాంట్రాక్టర్, అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తుడా ఉపాధ్యక్షులు ఎన్ మౌర్య హెచ్చరించారు. మంగళవారం తిరుపతి నగరంలో తుడా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భైరాగిపట్టెడ లోని బాబు జగజ్జీవన్ రామ పార్కు, శ్రీనివాస్ పార్కు, కపిలతీర్థం ఎన్‌జివో కాలనీలోని పార్కును అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ తుడా ఆధ్వర్యంలో అన్ని ప్రాంతాలలో నిర్వహిస్తున్న పార్కులు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మరమ్మతులకు గురైన ఆట వస్తువులు బాగు చేయాలన్నారు. మొక్కలు ఎండి పోకుండా నీరు పెట్టాలని సూచించారు. ఎండిపోయిన మొక్కలు తొలగించి కొత్త మొక్కలు నాటాలని, పచ్చిక ఏర్పాటు చేయాలని అన్నారు. వాకర్స్ ప్రతి రోజు పార్కులో నడిచేందుకు వీలుగా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. పార్కుల నిర్వహణలో లోపం కనిపిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వెంట ఈఈ రవీంద్ర, ఉద్యానవన శాఖాధికారి మాలతి పాల్గొన్నారు.

శ్రీసిటీలో జపాన్ ప్రతినిధుల బృందం

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: పెట్టుబడి, అవకాశాల పరిశీలనలో భాగంగా జపాన్‌లోని ఎహైమ్ రాష్ట్రానికి చెందిన 25 మంది ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం శ్రీసిటీని మంగళవారం సందర్శించింది. గవర్నర్ టోకిహిరో నకమురా నేతృత్వంలో విచ్చేసిన బృందానికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రత్యేకతలు, వివిధ రంగాలకు చెందిన అంతర్జాతీయ పరిశ్రమల ఉనికి గురించి వివరించారు. ఎహైమ్‌కు చెందిన వ్యక్తిగత సంరక్షణ, ఉత్పత్తుల తయారీ పరిశ్రమ, యూనిచార్మ్ సహా 30కు పైగా జపాన్ కంపెనీల ఏర్పాటుతో దేశంలో రెండవ అతిపెద్ద జపనీస్ పరిశ్రమల కేంద్రంగా శ్రీసిటీ అవతరించిందని చెప్పారు. గవర్నర్ అడిగిన ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ ఆంధ్రప్రదేశ్ పెట్టుబడిదారుల అనుకూల విధానాలను డాక్టరు సన్నారెడ్డి హైలైట్ చేశారు. వేగవంతమైన అనుమతులు, రంగాలవారి నిర్దిష్ట ప్రోత్సాహకాలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' తదితర అంశాల గురించి వివరించారు. శ్రీసిటీలో పరిశ్రమల స్థాపనతో బలమైన ఉనికిని చాటాలంటూ ఎహైమ్ రాష్ట్ర పారిశ్రామిక వేత్తలను ఆయన ఆహ్వానించారు. పర్యటనలో పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడి అవకాశాలు, శ్రీసిటీ సమగ్ర పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ అంశాలపై ప్రతినిధి బృందం చురుగ్గా చర్చించింది. ప్రపంచ శ్రేణి పారిశ్రామిక పార్కును అభివృద్ధి చేయడంలో యాజమాన్య కృషిని అభినందించిన గవర్నర్ నకమురా, శ్రీసిటీలోని విశాల స్థలం, అద్భుత మౌలిక సదుపాయాలు, పెట్టుబడిదారులకు అనువైన పారిశ్రామిక వాతావరణాన్ని ప్రశంసించారు. శ్రీసిటీలో ఉన్న జపనీస్ పారిశ్రామిక ప్రవాస సిబ్బంది పట్ల కనబరుస్తున్న శ్రద్ధను కొనియాడుతూ, శ్రీసిటీతో బలమైన వ్యాపార బంధం కోసం తాము ఎదురు చూస్తున్నామని వ్యాఖ్యానించారు. ప్రతినిధి బృందంలో ఎహైమ్ అసెంబ్లీ ఛైర్మన్ హిరోమాసా మియాకేతో పాటు ప్రభుత్వం, బ్యాంకింగ్ రంగం, వివిధ వ్యాపార సంఘాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతినిధులు, డైకిన్ ఏసీల తయారీ పరిశ్రమను సందర్శించి, అక్కడ కార్యకలాపాలను పరిశీలించారు. ప్లాంట్ అధికారులతో చర్చించారు. సుమిటోమో వంటి ప్రధాన సంస్థల ఉనికితో నౌకా నిర్మాణం, కాగితం తయారీ, రసాయనాలు, ఖచ్చితత్వ యంత్రాల తయారీకి ఎహైమ్ రాష్ట్రం ప్రధాన కేంద్రంగా వుంది. ప్రపంచ సుస్థిరత లక్ష్యాలకు అనుగుణంగా పునరుత్పాదక శక్తి, అధునాతన పరికరాల తయారీలోనూ ఈ రాష్ట్రం మంచి పురోగతిని సాధిస్తోంది.


శ్రీ సిటీని సందర్శించిన జపాన్ ప్రతినిధుల బృందం

ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్ట్

దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి లోని అన్నమయ్య జిల్లా వీరబల్లి ఫారెస్టు బీటులో ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి వారి నుండి తొమ్మిది ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఎర్రచందనం టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు. ఎర్రచందనం టాస్క్ ఫోర్సు ఉన్నతాధికారుల ఆదేశాల తో ఆర్ఐ (ఆపరేషన్స్) కే.సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ లింగాధర్ బృందం స్థానిక ఎఫ్బీఒ అనిల్ కుమార్ తో కలసి, సోమవారం నుంచి అన్నమయ్య జిల్లా వీరబల్లి అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారన్నారు. వీరు ఆ ప్రాంతంలోని ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను తనిఖీ చేసుకుంటూ వెళుతుండగా మంగళవారం ఉదయం వీరబల్లి మండలం జరికోన వద్దకు చేరుకోగా అక్కడ కొంత మంది వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారన్నారు. వారిని హెచ్చరించి లొంగిపోవాలని సూచించడంతో వారు దుంగలు పడేసి పారిపోయేందుకు ప్రయత్నించారన్నారు. వారిని వెంబడించి ఆరుగురిని అదుపులోకి తీసుకొని ఆ ప్రాంతంలో ఉన్న 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. అదుపు లోకి తీసుకున్న వారు తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారుగా గుర్తించామన్నారు. వీరిని అరెస్టు చేసి తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్లో ఎస్పై రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు. పారిపోయిన వారికోసం గాలింపు చర్యలు ప్రారంభించామన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీలు వీ శ్రీనివాస రెడ్డి, ఎండీ షరీఫ్ పాల్గొన్నారు.


పోలీసుల అదుపులో ఎర్రచందనం స్మగ్లర్లు

చిరుతల సంచార నివారణకు చర్యలేవి?

- చిరుతల సంతతి గణన జరుగుతోందా?
- భయం గుప్పెట్లో ఉన్నత విద్య విద్యార్థులు
- సంచరిస్తున్నవి పట్టి విడిచిపెట్టిన చిరుతలా?

పజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అడవిలో రోజు రోజుకూ చిరుతల సంచారం కలవర పెడుతోంది. అడవిలో చిరుతల సంఖ్య పెరుగుతున్న కొద్దీ అవి జనావాసాల వైపు ఆహార అన్వేషణలో భాగంగా వచ్చి భయాన్ని సృష్టిస్తున్నాయి. గత నెల రోజులుగా అరిపిరి నుండి జూపార్కు వైపు ఉన్న అటవీ ప్రాంతం నుండి ఈ మార్గంలో ఉన్న వైద్యశాలలు, విశ్వ విద్యాలయాల పరిధిలో సంచరిస్తూ ఇక్కడి కుక్కలను, ఆహారాన్ని వెతుక్కుంటూ వచ్చే జింకలను చిరుతపులి దాడి చేసి చంపి తింటున్నా వాటి సంచార నివారణకు అటవీశాఖ అధికారులు నుండి స్పందన అంతంత మాత్రం గానే ఉంది. చిరుత జాడలను గుర్తించిన అటవీ శాఖ అధికారులు ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి అటు తర్వాత మౌనంగా వుండిపోయారని వర్సిటీ విద్యార్థులు, ఆచార్యుల నుండి విమర్శలు వినిపిస్తున్నాయి. చిరుత యథేచ్ఛగా వర్సిటీ పరిధిలో తిరుగుతూ విద్యార్థులు హాస్టళ్ల వద్ద విడిచిపెట్టిన ఆహారాన్ని తినడానికి సంచరించే కుక్కలను చంపుతోంది. ఇందుకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి.

శాశ్వత పరిష్కారం ఏది?

గతంలోనూ విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థు లు బస చేసే హాస్టళ్ల వద్ద చిరుత సంచరించిన సిసి పుటేజ్‌లు ఉన్నాయి. విశ్వవిద్యాలయాల లోపలికి రావడానికి చిరుతకు ఎలాంటి అడ్డంకులు లేనట్టుగా తెలుస్తోంది. అటవీ సరిహద్దు ప్రాంతం అలిపిరి నుండి చెర్లోపల్లి వరకు పరిశీలిస్తే అటవీ సరిహద్దుకు ఆనుకుని ఉన్న ప్రధాన మార్గం దాటుకుని పడమర వైపుగా ప్రయాణించేటప్పుడు ఎడమవైపు ప్రారంభం నుండి రూయా హాస్పిటల్, నూతనంగా నిర్మిస్తున్న చిన్న పిల్లల టీటీడీ వైద్యశాల, భారతీయ విద్యా భవన్, స్విమ్స్ హాస్పిటల్, ఎస్వీ యూనివర్సిటీ, అగ్రికల్చర్ యూనివర్సి టీ, టాటా క్యాన్సర్ హాస్పిటల్ ఇలా ప్రజలు, విద్యార్థులు నిత్యం సంచరించే ప్రదేశాలు. ఇక్కడ చిరుత సంచారాన్ని అరికట్టే విధంగా ఎక్కడ ప్రహరీ నిర్మాణాలు లేవని తెలుస్తోంది. వన్య మృగాల సంచారాన్ని అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. లేదంటే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని చెప్పాలి. చిరుతల సంచారంతో విద్యార్థులు సాయంత్రం అయిందంటే చాలు భయం గుప్పెట్లో ప్రాణాలు పెట్టుకుని బిక్కుబిక్కు మంటూ నాలుగు గోడల మధ్య ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇకనైనా వర్సిటీ అధికారులు, అటవీ శాఖ అధికారులు సమ న్వయ సమావేశాలు నిర్వహించి తీసు కోవలసిన జాగ్రత్తలను చర్చించాల్సి వుంది.

చిరుత సంతతిపై గణన జరుగుతోందా?

శేషాచలం అటవీ పరిధి తిరుపతి జిల్లాలోని ఎనిమిది రేంజిలలో చిరుతల సంతతి నానాటికీ గణనీయంగా పెరుగుతోంది. కరోనా సమ యంలో చిరుతల సంతానోత్పత్తి ఎక్కువగా జరిగిందని, ఇదివరకే అటవీశాఖ అధికారులు ఈ విషయాలను ధృవీకరించారు. అయితే గతంలో తిరుమల నడక మార్గంలో మొదట్లో కర్నూలుకు చెందిన ఓ బాలుడుపై దాడి చేసింది. తరువాత నెల్లూరు జిల్లాకు చెందిన బాలి క లక్షితపై చిరుత దాడి చేసి చంపింది. ఈ పరి స్థితులలో అటవీశాఖ, టీటీడీ సంయుక్తంగా సమావేశా లు నిర్వహించి చిరుతలను బంధించాలని బోన్లు ఏర్పాటు చేసి దాదాపు ఆరు చిరుత పులులను బందించి దట్టమైన అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. అయితే ఇటు తిరుమలలో, ఎస్వీ యూనివర్సిటీ పరిధిలోనూ చిరుత పుల్లల సంచారం జరుగుతున్న నేపథ్యంలో ఈ పులులు సంతతి పెరిగిందని వాటిలో వున్నాయా? లేక అప్పట్లో విడిచిపెట్టిన చిరుతలే మళ్లీ ఈ ప్రాంతానికి వచ్చి సంచరిస్తున్నాయా? అనే అని అనుమానాలు కలుగుతున్నాయి. గతంలో అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాల మేరకు 30 పులులను గుర్తించామని తెలిపారు. చిరుత పులుల గణన గతంలో జరిగిందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం చిరుతపులుల సంతతి పెరిగిన నేపథ్యంలో వాటి సంఖ్య ఎంత అనే విషయాలను అటవీశాఖ అధికారులు తేల్చాల్సి ఉంది. తదనగుణంగా ఆహార అన్వేషణలో జననివాస ప్రాంతాలకు వచ్చే చిరుత పులులను కట్టడి చేయడానికి కార్యచరణ చర్యలను అమలు చేసే అవకాశం ఏర్పడుతుంది. కానీ అటవీశాఖ అధికారులు మాత్రం చిరుతపులుల గణనపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. జిల్లా అటవీ శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఐఎఫ్ఎస్ అధికారి వివేక్ అటవీ శాఖకు సంబంధించిన విషయాలను పత్రికా విలేకరులు అడగడానికి ఫోన్ ద్వారా ప్రయత్నించినా ఆయన స్పందించడం లేదు.



కొనసాగుతున్న చిరుత కదలికలు

అప్రమత్తం చేస్తున్న వర్సిటీ, ఫారెస్ట్ అధికారులు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో కేంద్రీయ లైబ్రరీ వెనుక చిరుత కనిపించిందని విద్యార్థులు అటవీ శాఖాధికారులకు, వర్సిటీ రిజిస్ట్రార్ దృష్టికి తీసుకురావడంతో వారు ఇద్దరూ వెను వెంటనే స్పందించి కేంద్రీయ గ్రంథాలయం వద్దకు చేరుకొని వాహనాలతోనే ఆ పొదలలో పరిశీలించారు. చిరుత జాడ కనిపించలేదు. అక్కడ గుమికూడిన విద్యార్థులను రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, ఫారెస్ట్ అధికారి సౌజన్యలు చిరుత పులుల వ్యవహార శైలి, ఆహార సేకరణపై వివరణ ఇచ్చారు. మెస్‌లకు వెళ్లినప్పుడు గుంపులుగా వెళ్లాలని వారు ఆదేశించారు.

ట్రాప్‌లు ఏర్పాటు

ఇప్పటికే వర్సిటీలో చిరుత కోసం ట్రాప్‌లు ఏర్పాటు చేస్తున్నామని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. అయితే వాటి వద్దకు విద్యార్థులు వెళ్లి అల్లరి చిల్లరగా తనిఖీలు చేయడం వల్ల మనిషి పాదముద్రల వాసన గ్రహించి ఆ ట్రాప్ వద్దకు చిరుతలు రావని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆచార్య ఎన్ సి రాయుడు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టరు పాకనాటి హరికృష్ణ పాల్గొన్నారు.

దళితుల భూములను రక్షించండి: సిపిఎం

ప్రజాశక్తి -కెవిబిపురం: కెవిబిపురం దళితులకు ఇచ్చిన పట్టా భూమిని కొందరు పెత్తందారులు దౌర్జన్యంగా ఆక్రమిస్తున్నారని, ఆక్రమణలు తొలగించి రక్షణ కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధ న్ అధికారులను కోరారు. బాధితుడు, మాజీ సర్పంచి వెంకటయ్య సిపిఎం నాయకులు గురవయ్య, నాగరాజులు కలసి కెవిబి పురం మండల తహశీల్దారు మునిరత్నంకు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ ఎంఏ రాజుల కండ్రిగ రెవెన్యూలో సర్వేనెంబర్ 428/2 ఎలో 1.39 సెంట్లు భూమిని 1980లో ప్రభుత్వం డీకేటీ పట్టా వెంకటయ్య, తల్లి కలపాటి పెంచలమ్మ, భర్త శ్రీనివాసులు పేరుపై మంజూరు చేసిన భూమిని మఠం గ్రామానికి చెందిన పెత్తందారులు, భూస్వాములు, దళితులపై దౌర్జన్యం చేసి ఆ భూముల్లోకి ప్రవేశించకుండా అడ్డుకుంటున్నారన్నారు. దళితుని భూమి కూడా పక్కనే వున్న కారణంగా దళితుని భూమిని కూడా కబ్జా చేసి దౌర్జన్యంగా ఆక్రమిస్తున్నారని తెలిపారు. గతంలోనే ఆక్రమణదారుపై కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నప్పటికీ పదేపదే భూమిలోకి రానివ్వకుండా ఘర్షణ పడుతున్న సందర్భంలో దళితులపై దాడి చేసి గాయపరిచారని, వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినా ప్రస్తుతం అధికార పార్టీ అని చెప్పి దౌర్జన్యాలకు పాల్పడుతూ దళితుడిని భూమిలోకి వెళ్లనివ్వకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. తక్షణమే రెవెన్యూ అధికారులు స్పందించి సర్వే అధికారులు, పోలీసుల సమక్షంలో సర్వే చేసి ఈ భూమికి హద్దులు చూపించి దళితులకు అప్పగించాలని కోరారు. స్పందించిన తహశీల్దారు మునిరత్నం మాట్లాడుతూ పోలీస్ బందోబస్తుతో సర్వే చేసి హద్దులను చూపుతామని ఆక్రమణ దారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు జనార్ధన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి సిపిఎం నాయకులు పెనగడం గురవయ్య, కేవిబి పురం మండల ప్రాంతీయ కార్యదర్శి నాగలాపురం నాగరాజు, బాధితుడు వెంకటయ్య, గిరిజన సంఘం నాయకుడు లక్ష్మయ్య పాల్గొన్నారు.


తహశీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

నాణ్యమైన భోజనం, మెరుగైన విద్య అందించండి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన విద్య అందించాలని మండల విద్యాశాఖాధికారి ముని సుబ్రహ్మణ్యం సూచించారు. మండలంలోని లక్ష్మీపురం పాఠశాల, బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వంటవారికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కుష్టు, క్షయ నిర్మూలన అధికారి డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి సందర్శించారు. క్యాన్సర్ , కుష్టు వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ దివాకర్, డాక్టర్ విద్యాసాగర్, ఆరోగ్య అధికారి డిఎస్ వెంకటేశులు, జిల్లా కుష్టు విభాగ ఫిజియోథెరపి అధికారి వెంకటరమణ, స్వచ్ఛంద సేవా సంస్థ సేవ్ బాలాజీలు పాల్గొన్నారు.

స్టార్టప్ కంపెనీ ప్రతినిధులకు సన్మానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో స్టార్టప్ కంపెనీ ప్రతినిధులను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. ఆదిశంకర కాలేజ్‌లో భారత ప్రభుత్వ సహకారంతో స్థాపించబడిన ఏ.సి.ఐ.సి ఆదిశంకర ఇన్నోవేషన్, ఇన్క్యుబేషన్ సెంటర్ అనుసంధానంగా నెలకొల్పిన సాట్కో1 అనే స్టార్టప్ ప్రతినిధులు సుజిత్ మౌళి, సుశాంత్ మౌళి, సత్యంలు ఈనెల 2 వ తేదిన నిట్, రుర్కెల నందు జరిగిన ఎన్. ఈ.ఎస్ –2025 లో పాల్గొని తృతీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా ఏ.సి.ఐ.సి సి. ఈ.వో డాక్టర్ ఇమ్మానుయేల్ స్టార్టప్ ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్టార్టప్ ప్రతినిధులు మాట్లాడుతూ ఈ స్టార్టప్ ద్వారా అధునాతన ఏ. ఐ.టెక్నాలజీ ఉపయోగించుకొని టీబీ డిసీజ్ ను ఎర్లీ స్టేజ్ లోనే కనుగొనవచ్చు అన్నారు. టీబీ వ్యాధిగ్రస్తులు వాడుతున్న మందులను సకాలంలో వేసు కొనేలా ఆటో రేమైన్డర్స్, పంపడం వలన టీబీని నిర్మూలించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది వేణుమాధవ్, రాజయ్య, ఏవో రామయ్య,తదితరులు పాల్గొన్నారు.

నేడు డాక్టర్ సంఘమిత్ర రాక

ప్రజాశక్తి -కోట : నెల్లూరు కిమ్స్ హాస్పిటల్ నుండి ప్రముఖ న్యూరాలజిస్ట్ (నరముల వ్యాధి నిపుణులు) డాక్టర్ సంఘమిత్ర, కోట మండలంలోని జనతా క్లినిక్ ఆసుపత్రికి బుధవారం వస్తున్నట్లు ఆసుపత్రి డాక్టర్ ఎమ్.జగదీష్ తెలిపారు.ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల మొదటి బుధవారం కోటలో డాక్టర్ సంఘమిత్ర అందుబాటులో ఉంటారన్నారు. పక్షవాతం, మూర్ఛ ,తలనొప్పి, మధుమేహం, వెన్నుపూస సమస్యలు మొదలైన లక్షణాలు ఉన్నట్లయితే జనతా క్లినిక్ ఆసుపత్రిలో చికిత్స చేసుకోవాలని తెలియజేశారు.

ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోండి

- నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వ్యవసాయం పనులు ప్రారంభమయినందున నగరి నియోజకవర్గంలో ఎరువుల కొరత లేకుండా చూడాలని, అందుకు స్టాక్ అందుబాటులో ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని, నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలిబాను ప్రకాష్ వ్యవసాయ శాఖ అధికారులకు మంగళవారం సూచించారు. రైతుల సమస్యలు పరిష్కారం చేసేట్లు వ్యవసాయ శాఖ సిబ్బంది సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో నగరి ఏడిఎ సౌభాగ్య లక్ష్మి, పుత్తూరు ఏడిఎ రమేష్ పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : బీసీలకు పెద్దపీట వేసిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్ కుమార్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నాయి బ్రాహ్మణల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం పాల్గొన్నారు. వారు మాట్లడుతూ నాయి బ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాజు, జిల్లా అధికార ప్రతినిధి చెంచురామయ్య, టిడిపి నాయకులు రహీం , ఇజ్రాయిల్, కుమార్‌లు పాల్గొన్నారు.

కబ్జా భూమికి హెచ్చరిక బోర్డులు

ప్రజాశక్తి -బుచ్చిరాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం, కనమనంబేడు గ్రామ సర్వే నంబర్ 352లో ఉన్న ప్రభుత్వ భూమిపై శ్రీకాళహస్తికి చెందిన డాక్టర్ బత్తయ్య నాయుడు కన్నేశారు. ఆ భూమి చుట్టూ ఫెన్సింగ్ నాటడంతో ఆగ్రహించిన కనమనంబేడు దళితవాడకు చెందిన గ్రామస్తులు ఇండ్ల స్థలాల కోసం సిపిఐ నాయకుల ఆధ్వర్యంలో ఫెన్సింగ్ తొలగించి, ఇళ్ల స్థలాల కోసం తమ ఆధీనంలో ఉంచుకున్నారు. మండల తాసిల్దార్ సుబ్రహ్మణ్యం ఆ భూమిని ప్రభుత్వ భూమిగా నిర్ధారిస్తూ పోలీసు వారి సహాయంతో హెచ్చరిక బోర్డులు పెట్టించారు. ఆయన మాట్లాడుతూ ఈ భూమి బుచ్చినాయుడు కండ్రిగ మండల కాంప్లెక్స్‌కు కేటాయించిన భూమి కావున భూమిలోనికి ఎవరికి అనుమతి లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ నల్లయ్య, వీఆర్వో బాలమురళి, రంగయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుండె పోటు పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: గుండె పోటు వచ్చినపుడు అప్రమత్తంగా ఉండాలని శ్రీకాళహస్తి ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి పర్యవేక్షకురాలు డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో మంగళవారం గుండె పోటు లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ గుండె పోటు వచ్చినపుడు మొదటి గంట చాలా కీలకమనీ, ప్రాణాలు కాపాడుకోవడానికి గుండె పోటు బాధితులకు వైద్య సేవలు వెంటనే అందించాలని డాక్టర్ విజయలక్ష్మి విజ్ఞప్తి చేశారు. ఈ సదస్సులో ఆర్ఎంవో డాక్టర్ మధు తదితరులు పాల్గొన్నారు.

విదేశీ పెట్టుబడులతో బీమా రంగానికి నష్టం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : బీమా రంగంలో100 శాతం విదేశీ ప్రైవేటు కంపెనీలు పెట్టుబడులు పెట్టినట్లయితే వారికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాల్సి ఉంటుందని ఎల్ఐసి యూనియన్ కార్యదర్శి ఎన్.లక్ష్మణ్ కుమార్ తెలిపారు. అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు స్థానిక ఎల్ఐసి ఉద్యోగులు భోజన విరామ సమయంలో కార్యాలయ ఆవరణలో మంగళవారం ధర్నా నిర్వహించారు. విదేశీ పెట్టుబడుల వలన పాలసీదారుల ప్రయోజనాలకు, భీమా సొమ్ముకు గ్యారంటీ లేకుండా పోతుందన్నారు. అనంతరం సిఐటియు జిల్లా నాయకులు ఆర్.వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలు, వారు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ యూనియన్ అధ్యక్షులు డి.దస్తగిరి, యూనియన్ నాయకులు, ఉద్యోగులు, కార్మిక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎంజీఎంలో రథ సప్తమి పూజలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఎంజీఎం ఆసుపత్రిలో మంగళవారం రథసప్తమి వేడుకలు నిర్వహించారు. ఎంజీ ఎం హాస్పిటల్ డైరెక్టర్ గుడ్లూరు మయూర్ ఆధ్వర్యంలో హెూమాది కార్యక్రమాలు నిర్వహించారు. అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని పూజలు చేసినట్లు మయూర్ తెలిపారు. ఎన్టీఆర్ సేవ, ప్రముఖ ఇన్సూరెన్సు కంపెనీల ద్వారా పూర్తి ఉచితంగా వైద్య సేవలు అందుబాటులో వుంటాయని, ఈ అవకాశాన్ని పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ వివేక్ చైతన్య లు పాల్గొన్నారు.

శివరాం.. శివతాండవం

ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులు ఎందుకు ఏర్పాటు చేయరు ?

- ప్రభుత్వ భూముల పరిరక్షణ గాలికి
- రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం
- ఆర్డీవో ఆదేశాలు బేఖాతర్
- వివరణ కోరితే.. తహశీల్దార్ కస్సు.. బుస్సు

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి) : చంద్రగిరి, అనుపల్లి ప్రధాన రహదారికి ఆనుకుని, ఇందిరమ్మ కాలనీకి వెళ్లే రహదారి పక్కనున్న విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనా రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పత్రికల్లో కథనాలు వచ్చినప్పటికీ, ఆ భూమి పరిరక్షణలో చంద్రగిరి రెవెన్యూ అధికారులు పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు అంటున్నారు. చంద్రగిరిలో ప్రభుత్వ భూమి కబ్జా.. పట్టించుకోని రెవెన్యూ అధికారులు అనే శీర్షికతో జనవరి 27న ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైనది. ఈ వార్తపై తిరుపతి రెవెన్యూ డివిజనల్ అధికారి రామ్మోహన్ స్పందించి, కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూముల వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని తహశీల్దార్ ఏ శివరామ సుబ్బయ్యను ఆదేశించారు. కానీ ఆర్డీవో ఆదేశాలను ఖాతరు చేయకుండా ఇప్పటివరకు ఆ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో స్థానికులు అధికారుల తీరు పట్ల అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు చంద్రగిరి రెవెన్యూ లెక్క దాఖలాలోని సర్వేనెంబర్ 1513/8లో 0.47 సెంట్లు భూమి రెవెన్యూ రికార్డులలో అనాధీనంగా (ప్రభుత్వ భూమిగా) నమోదయి ఉంది. అదే భూమికి గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి రెవెన్యూ అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి, ఆన్‌లైన్‌లో అసైన్‌మెంట్ యాక్ట్ నిబంధనలకు విరుద్ధంగా కె.విజయలక్ష్మి పేరున 1513/8ఎ డబుల్ ఎంట్రీ చేశారు. దీనిపై 2022 సంవత్సరంలో అప్పటి జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ ఆ సర్వే నెంబరును ఆన్‌లైన్‌లో తొలగించాలని ఆదేశించడంతో అప్పటి చంద్రగిరి తహసిల్దార్ చిన్న వెంకటేశ్వర్లు ఆన్‌లైన్‌లో డియాక్టివేట్ చేశారు. కానీ ఇటీవల 1513/8ఎ ఆన్‌లైన్‌లో యాక్టివేషన్ కావడంతో కబ్జాదారులు ఆ భూముల్లో ముళ్ళ పొదలను తొలగించి రియల్ ఎస్టేట్ వెంచర్ వేసేందుకు ప్రయత్నం చేశారు. ప్రభుత్వ భూములు పరిరక్షణ లక్ష్యంగా పనిచేయాల్సిన రెవెన్యూ అధికారులు చూసి చూడనట్లు పది రోజులు కావస్తున్న పట్టించుకోకపోవడంలో ఆంతర్యమేమిటిని పలువురు ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ అధికారులు కబ్జాదారులతో కుమ్మక్కై విలువైన ప్రభుత్వ భూమిని దారా దత్తం చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంపై జిల్లా కలెక్టర్, ఆర్డీవోలు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలని స్థానికులు అంటున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఆ ప్రభుత్వ భూమికి సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో ఎప్పుడు ట్యాంపరింగ్ జరిగింది? ఎవరు ఆన్‌లైన్‌లో యాక్టివేషన్ చేశారు? తదితర విషయాలు బయటకు రావాలంటే మ్యుటేషన్ తీయిస్తే రెవెన్యూ దొంగలు బయటపడే అవకాశం ఉంది. ఆ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయకపోతే ప్రజా సంఘాల ద్వారా తహసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని పలువురు హెచ్చరిస్తున్నారు. ఉన్నతాధికారులు విలువైన భూ కబ్జా విషయంపై సమగ్ర విచారణ చేసి, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



చంద్రగిరిలో ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయని దృశ్యం

తహశీల్దారుకు కోపమొచ్చింది..!



తహశీల్దార్ శివరాం సుబ్బయ్యను మంగళవారం ఫోన్‌లో వివరణ కోరగా రికార్డుల పరిశీలన ఇంకా జరగాల్సి ఉందని, నేను హెచ్చరిక బోర్డు ఎప్పుడు పెట్టే విషయం మీడియాకు చెప్పనవసరం లేదంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ, ఆగ్రహం వ్యక్తం చేస్తూ మీడియాపై చిందులు వేశారు. ఆయన వ్యవహార శైలిని మీడియా ప్రతినిధులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.

ఇన్‌సెట్‌లో ఏ. శివరాం సుబ్బయ్య, తహశీల్దార్, చంద్రగిరి

మేత భూమిని కాపాడుకుంటాం : జనసేన



కోబాకలో గోవు పోరంబోకు భూములు పరిశీలిస్తున్న వినుత

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలం కోబాక రెవెన్యూ సర్వే నంబర్ 174 లో ఉన్న 123.5 ఎకరాల గోవుల మేత పోరంబోకు స్థలాన్ని కాపాడుకుంటామని శ్రీకాళహస్తి నియోజకవర్గం జనసేన ఇన్చార్జి కోట వినుత స్పష్టం చేశారు. మంగళవారం ఆమె కోబాక గ్రామంలో పర్యటించారు. పరాధీనం అవుతున్న మేత భూములను మహిళలతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పశువులు, గొర్రెల మేత కొరకు ఉపయోగించుకునే ఈ భూములను గత ప్రభుత్వ హయాంలో కొందరు వైసీపీ నేతలు చెరబట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లాట్లు వేసి లక్షలకు అమ్ముకుని ఇల్లు నిర్మించుకున్నారని గుర్తు చేశారు. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా కొంత మంది ప్రభుత్వ స్థలాన్ని అన్యాయంగా ఆక్రమించుకుని లక్షలకు అమ్ముకుని ఇళ్ళ నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. ఈ సర్వే నంబర్ 174లో ఉన్న గోవు పోరంబోకు స్థలానికి హై కోర్టు లో స్టే ఆర్డర్ ఉన్నా కొందరు కబ్జాలకు దిగుతుండటం అనుమానాలకు తావిస్తోందన్నారు. విలువైన ప్రభుత్వ భూములను ఎవరు కబ్జా చేసినా జనసేన ఊరుకోదని హెచ్చరించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి మేత భూముల సమస్యను తీసుకెళ్లి కాపాడుకుంటామని హామీ ఇచ్చారు.

జిల్లాస్థాయిలో అవార్డులు సాధించిన ఆర్కే అబాకస్ చిన్నారులు



విజేతలకు ప్రశంసా పత్రాలు ఇస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆర్.కె.అబాకస్ విద్యార్థిని రాసమల్లి డోలాషిత జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించినదని ఆర్కే సంస్థ చైర్మన్ డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆ చిన్నారిని అభినందిస్తూ మరెన్నో అవార్డులు కూడా సొంతం చేసుకోవాలని రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా బీసీ జనరల్ సెక్రటరీ అనగాని రెడ్డప్ప, నరసింహశాస్త్రి, మధు, వీక్ష విద్యాసంస్థ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంస్కృత విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్‌గా కడియం వెంకట నారాయణ రావు భాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి నూతన రిజిస్ట్రార్ గా కడియం వెంకట నారాయణరావు ఈ రోజు బాధ్యతలు స్వీకరించారు.. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం అధికారులు ఆయనకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అకడమిక్ డీన్ ప్రొ.రమాకాంత శుక్లా, విశ్వవిద్యాలయ విభిన్న విభాగాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మార్చి 31 లోపు బి.పి.ఎస్., ఎల్.ఆర్.ఎస్.కి దరఖాస్తు చేసుకోండి : కమిషనర్ మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: 2019లో ప్రభుత్వం జారీచేసిన బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం–2019లో అనుమతి లేని , విరుద్ధముగా నిర్మించిన భవనములను క్రమబద్ధీకరణకు మార్చి 31 లోపు దరఖాస్తు చేసుకోవా లని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య మంగళవారం ఒక ప్రకట నలో తెలిపారు. అలాగే 2020వ సంవత్సరంలో ప్రభుత్వం జారీ చేసిన లేఔట్ రేగులరైజేషన్ స్కీం–2020లో అనుమతిలేని లేఔట్లు, ప్లాట్లు కమబద్ధీకరించుకోవడానికి మరో అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు.

లేబర్ కోర్టు తీర్పును తక్షణమే అమలు చేయాలి

ప్రజాశక్తి -కోట : లేబర్ కోర్టు గుంటూరు వారి తీర్పును కాలేజీ యాజమాన్యం తక్షణమే ఉద్యోగుల విషయంలో అమలుచేయాలని ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎన్.చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. కాలేజీ యాజమాన్యం స్పందించి నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు.

శ్రీ సాయి ఎస్వి డయగ్నోస్టిక్స్‌ను ప్రారంభించిన రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : స్థానిక రెడ్డి అండ్ రెడ్డి కాలనీలో నూతనంగా ప్రారంభించిన శ్రీ సాయి ఎస్వి డయాగ్నస్టిక్స్ సెంటర్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆయనకు ఎస్వి డయాగ్నస్టిక్స్ అధినేత,ఐఎంఏ జాతీయ ఉపాధ్యక్షులు అప్పా మాజీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ దగ్గు మాటి శ్రీహరిరావు స్వాగతం పలికారు.

సత్యవేడులో.. కులోన్మాద హత్య..?





ఆసుపత్రిలో మృతి చెందిన ఆటో డ్రైవర్ లక్ష్మయ్య

సత్యవేడు - తిరుపతి: సత్యవేడు మండలం, ఓబుల రాజు కండ్రిగలో ఆటో బాడుగకు సంబంధించి నెలకొన్న వివాదం, ఆఖరికి అగ్రవర్ణాల చేతిలో దళితుడి హత్యకు దారి తీసింది. వివరాల్లోకెళ్తే సత్యవేడు మండలం ఓబులరాజు కండ్రిగ అరుంధతివాడకు చెందిన ఆటో డ్రైవర్ లక్ష్మయ్య పాండూరు నుంచి ప్రయాణికులను ఆటోలో తీసుకెళ్తుండగా, అక్కడే ఉన్నా జగదీష్ రాజు, అరుల్ , లక్ష్మయ్యలు ఆటోను బాడుగకు పిలిచారు. ఆటోలో ప్రయాణికులు ఉన్నందున వదిలేసి వస్తానని లక్ష్మయ్య తెలిపాడు. తర్వాత ఆటో డ్రైవర్ తిరిగి వచ్చేలోగా వారు వేరే ఆటో మాట్లాడుకుని వెళుతున్నారు. అపుడు లక్ష్మయ్య వారిని వస్తాని చెప్పానుకదా అని అడిగాడు. వారి మధ్య వివాదం పెరిగింది. ఇరువురి కటుంబ సభ్యులు ఈ వివాదంలోకి వచ్చి లక్ష్మయ్యను ఇంటికి వెళ్లి దాడి చేశారు. సొమ్మసిల్లిన లక్ష్మయ్యను ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ మృతి చెందాడు. దాడి విషయం తెలుసుకున్న సత్యవేడు సీఐ మురళి నాయుడు, ఎస్సై రామస్వామి , సోమవారం రోజే ఘటనకు సంబంధించిన బాధితులపైన అట్రాసిటీ కేసు నమోదు చేశారు. జగదీష్ రాజు, భాస్కర్ రాజుతో పాటు ఆరుల్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం తెలుస్తుంది.

అధిష్టానం మాట శిరసావహిస్తా

- సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ మాటలు నాకు శిరోధార్యం
- సత్యవేడు నియోజకవర్గ ఇన్చార్జి పదవికోసం కొందరు నాపై కుట్ర పన్నుతున్నారు
- నా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు
- నా కుటుంబ సభ్యులను కూడా వదలట్లేదు
- ఎమ్మెల్యేగా నిరంతరం నియోజకవర్గ ప్రజల కోసం పని చేస్తున్నా
- నాపై అపనిందలు వేస్తున్న ప్రతి ఒక్కరిపై పరువునష్టం దావావేస్తా
- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం భావోద్వేగం





తెలుగుదేశం పార్టీ సత్యవేడు నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజాశక్తి - పిచ్చాటూరు (తిరుపతి జిల్లా): సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌ల అండతో ఎమ్మెల్యేగా గెలిచిన తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ, సత్యవేడు నియోజకవర్గానికి ఇన్చార్జిగా రావాలని కొందరు దిగజారుడు ప్రయత్నాలు చేస్తున్నారని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం భావోద్వేదానికి గురైయ్యారు. మంగళవారం పిచ్చాటూరులోని ఎంకేటీ కళ్యాణ మండపంలో ఎమ్మెల్యే అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ సత్యవేడు నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో వైసీపీలో ఉన్న తనకు, ఓ పెత్తందారీ ఎమ్మెల్యే టికెట్టు రాకుండా చేశారని, అదే పార్టీలో ఎంపీ టికెట్టు ఇచ్చినా కాదని తృణప్రాయంగా బయటకు వచ్చేశానన్నారు. అలాంటి కష్ట సమయంలో నన్ను చంద్రబాబునాయుడు, లోకేష్‌లు ఆదరించి ఎమ్మెల్యే టికెట్టు కేటాయించి తనను ఎమ్మెల్యేని చేశారన్నారు. దాన్ని జీర్ణించుకోలేని కొందరు ఎన్నికల సమయంలోనే తనను ఓడించి, తద్వారా పార్టీ ఇన్చార్జి భాద్యతలు తీసుకోవాలని తీవ్రంగా ప్రయత్నించి విఫలమైన సంగతి అందరికీ తెలిసిందేనన్నారు. అయితే దేవుని దయ, చంద్రన్న, లోకేష్‌ల ఆదరణతో ఎమ్మెల్యేగా గెలుపొందానన్నారు. అప్పటి నుండి ప్రతి నిత్యం ప్రజల్లో తిరుగుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తూ క్రమ శిక్షణ కలిగిన కార్యకర్తలా నడుచుకుంటున్నానన్నారు. ఎలాగైనా పార్టీ ఇన్చార్జిగా రావాలన్న తపన తీరని కొందరు నాపై కుట్ర పన్ని మహిళలతో తనకు, తన కుమారునికి అక్రమ సంబంధాలను అంటగట్టి, అసత్య ప్రచారాలకు తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను దళిత ఎమ్మెల్యేను కాబట్టే తనను, తన కుటుంబాన్ని మానసికంగా వేధించి క్షోభకు గురిచేస్తున్నారని, మిగిలిన నియోజకవర్గాల్లో ఇంత నీచానికి ఒడిగట్టగలరా..? అంటూ ఎమ్మెల్యే ప్రశ్నించారు. చివరికి తల్లిలాంటి పార్టీని బజారుకీడ్చడం కుట్రదారులకే చెల్లిందన్నారు. సర్పంచ్ స్థాయి నుండి నేటి వరకు సుమారు 50 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఉన్న తాను ఇలాంటి వాటికి భయపడేది లేదని, ధైర్యంగా ఎదుర్కొంటానన్నారు. దీనికి కారణమైన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటానని ఆయన స్పష్టం చేశారు. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకుల, కార్యకర్తల సహకారంతో ఎప్పటిలాగే నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజల కష్టాలను తెలుసుకుంటూ, నా ప్రాణం ఉన్నంత వరకు ప్రజా సేవకు అంకితమవుతానన్నారు. ఈ కార్యక్రమంలో పిచ్చాటూరు మాజీ మార్కెటింగ్ చైర్మన్ డి.ఇలంగోవన్ రెడ్డి, పద్దు రాజు, ఆయకట్టు చైర్మన్ రవి, వాసు రెడ్డి, జయ చంద్ర నాయుడు, అరుల్ ప్రకాష్, చిన్న, ఢిల్లీ రజిని, ఏడు మండలాలు టిడిపి అధ్యక్షులు అనుబంధ కమిటీ మెంబర్లు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్నారు

గత ఎలక్షన్‌లో టీడీపీని మోసం చేసి, స్వతంత్ర్య అభ్యర్థి వద్ద ముడుపులు అందుకొని, ఆదిమూలంకు టీడీపీ టికెట్ రాకుండా కొందరు కుతంత్రాలు చేశారు. కానీ చంద్రబాబు అండతో సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ విజయం సాధించింది. ఆదిమూలంపై చంద్రబాబు పెట్టుకున్న నమ్మకం గెలిచింది. ఇంకా ఆ కుట్రదారులు కొన్ని పత్రికలలో తప్పుడు కథనాలు రాయిస్తూ ఆదిమూలంను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు. ఇది చాలా దారుణం.

మల్లికార్జున రెడ్డి, కెవిబి పురం మండలం

ద్రోహులను దేవుడు కూడా క్షమించడు

2024 సంవత్సరంలో సత్యవేడు నియోజకవర్గంలో జరిగిన ఎమ్మెల్యే, ఎంపీ ఎలక్షన్లలో కొంతమంది టీడీపీ వారే కూటమి పార్టీలకు వ్యతిరేకంగా పనిచేశారు. చెరుకు గుర్తుపై నిలబడిన స్వతంత్ర అభ్యర్థితో పరోక్షంగా బేరం కుదుర్చుకున్నారు. పార్టీకి వెన్నుపోటు పొడిచారు. వారెన్ని కుట్రలు పన్నినా ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఆదిమూలానికి నిజాయితీ కలిగిన పార్టీ కార్యకర్తలు అండగా నిలబడి గెలిపించారు. ఆదిమూలాన్ని ఇబ్బంది పెట్టాలని అనేక ప్రయత్నాలు చేస్తున్న ముఠాను తొందరలోనే అధిష్టానం ముందు నిలబెడతాం. నియోజకవర్గంలో ఉన్న ఏడు మండలాల నాయకులతో కలిసి వారి కుట్రను బహిర్గతం చేస్తాం.

డీ.ఇలాంగోవన్ రెడ్డి, మాజీ మార్కెటింగ్ చైర్మన్, క్లస్టర్ ఇంచార్జి, పిచ్చాటూరు మండలం

క్రైం న్యూస్

ఆటో బోల్తా.. మహిళా కూలీకి తీవ్ర గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మంగమ్మ

ప్రజాశక్తి - రామ చంద్రపురం (చంద్రగిరి): భవన నిర్మాణ కూలీలను ఎక్కించుకొని చంద్రగిరికి వస్తున్న ఆటో నారావారిపల్లి మలుపు వద్ద బోల్తా పడగా రాయలపురం పంచాయతీ వెంకటంపేటకు చెందిన సందిపుట్టి మంగమ్మకు తీవ్ర గాయాల య్యాయి. ఆటోలో ప్రయాణిస్తున్న మరో యిద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గాయాలైన మంగ మ్మ పరిస్థితి విషమంగా ఉంది. చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఆమె కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లతో కేన్సర్‌ను నివారించవచ్చు

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లతో కేన్సర్‌ను నివారించవచ్చునని చంద్రగిరి గ్రామీణ వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ యుగంధర్ అన్నారు. కమ్యూనిటీ మెడిసిన్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ డాక్టర్ సునీత శ్రీగిరి ఆదేశాల మేరకు మంగళవారం చంద్రగిరి గ్రామీణ వైద్య ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ టాటాబాయి, రుయా నర్సింగ్ కాలేజ్ నర్సింగ్ ట్యూటర్ చిట్టెమ్మ, స్టాఫ్ నర్స్ దేవిక,సూపెర్వైజర్ నారాయణ రాజు మరియు ఆరోగ్య సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహనతో కేన్సర్‌ను జయించగలం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో తిరుపతి రూరల్ మండలంలోని కొప్పెరవాండ్లపల్లిలో మంగళవారం ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా గ్రామీణ మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హైమవతి మాట్లాడుతూ ప్రజలలో సరైన అవగాహనతోనే క్యాన్సర్ మహమ్మారిని జయించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్ర సిబ్బంది, ఇంద్రాణి, ప్రీతిలు పాల్గొన్నారు.

స్త్రీ నిధి రుణాలను సద్వినియోగం చేసుకోండి



ప్రజాశక్తి -దొరవారిసత్రం : పొదుపు సంఘాల ఆర్థిక బలోపేతం కోసం, మంజూరు చేస్తున్న స్త్రీ నిధి రుణాలు సక్రమంగా సద్వినియోగం చేసుకుంటున్నారా లేదాని స్త్రీ నిధి మేనేజర్ మల్లేశ్వరయ్య ఆరా తీస్తున్నారు. మంగళవారం మండల పరిధిలోని తల్లంపాడు1 వివో పరిధిలో మంజూరు చేసిన రుణాలు అర్హులకు అందాయా? వారు ఆ నిధులను ఏ విధంగా సద్వినియోగం చేసుకుంటున్నారని పొదుపు సభ్యులతో చర్చించారు. అతి తక్కువ వడ్డీతో ప్రభుత్వం ఇస్తున్న స్త్రీ నిధి రుణాలను చిన్న తరహా వ్యాపారాలపై పెట్టుబడిగా ఉపయోగించి ఆర్థికంగా బలపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎం.మునిరాజా, సి సి ధనమ్మ, పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.